
# దటీజ్ సుబ్బారావు!




పార్థసారథి ఆ ఆఫీసుకి ఇన్‌ఛార్జ్‌గా రిపోర్ట్ చేసి నెలరోజులు కావస్తోంది.

పని వత్తిడి ఎక్కువగా ఉన్నా- స్టాఫ్ మంచివాళ్ళు, సమర్థులూ కావడంతో యిబ్బందిగా అనిపించడం లేదు అతనికి.

ఆఫీసులో సుబ్బారావు అంటే అతనికి ప్రత్యేకమైన ఆసక్తి ఏర్పడింది. అందుకు కారణం... సుబ్బారావు సిన్సియర్ వర్కర్ అవడంతో పాటు పంక్చువాలిటీని పాటించే వ్యక్తి కూడా కావడం!

మొదట్లో పార్థసారథి నాలుగైదు రోజులు ఆఫీసుకు ఆలస్యంగా వచ్చాడు. అయితే తనకంటే ముందే వచ్చి సీటులో కూర్చుని పనిచేసుకుంటున్న సుబ్బారావును చూడగానే సిగ్గుపడ్డాడు. తనకంటే క్రిందిస్థాయి వ్యక్తి క్రమశిక్షణ పాటిస్తున్నప్పుడు తను ఆఫీసులో అందరికీ అధికారిగా ఉంటూ ఆఫీసుకి ఆలస్యంగా రావడం అతనికి ఎబ్బెట్టుగా అనిపించింది. అప్పట్నుంచీ సకాలంలో ఆఫీసు చేరుకోవడానికి ప్రయత్నించసాగాడు. అయితే ఎంత ప్రయత్నించినా నెలకు నాలుగురోజులైనా ఆలస్యంగానే వచ్చేవాడు. అందువల్ల సుబ్బారావును చూసినప్పుడల్లా ఆత్మన్యూనతా భావంతో బాధపడేవాడు.

సుబ్బారావు పనితీరు పార్థసారథికి ఎంతో నచ్చేది. తీరైన అక్షరాల పొందిక, ప్రతి పని ఓ పద్ధతిగా చెయ్యడం, ఎప్పుడూ నవ్వుతూ ఉండటం, ఏ ఫైలు అడిగినా క్షణాల్లో తెచ్చివ్వడం, తను మరచిపోయిన పనులు కూడా అతను గుర్తుచేసి తనచే చేయించడం-యివన్నీ సుబ్బారావును యిష్టపడటానికి కారణాలయ్యాయి.

ఓరోజు అటెండెన్స్ రిజిస్టర్ చూస్తున్న పార్థసారథి సుబ్బారావు అందులో సంతకం చేయకపోవడం చూసి, అటెండర్‌ని పిలిచి సుబ్బారావుచే సంతకం చేయించుకుని రమ్మని రిజిస్టర్ యిచ్చాడు. అయితే సుబ్బారావు యింకా ఆఫీసుకు రాలేదని అటెండర్ చెబితే అతను ఆశ్చర్యపోయాడు. లేచి గది నుండి బయటకి వచ్చి సుబ్బారావు సీటు వైపు చూశాడు. నిజమే... సుబ్బారావు యింకా రాలేదు.

'సుబ్బారావు లీవు గాని, పర్మిషన్ గాని పెట్టివుంటే యీపాటికి తనకు తెలిసేది. అవి లేకుండా సుబ్బారావు ఆఫీసుకి రాకుండా ఉండడు!' అనుకున్నాడు. ఆలోచిస్తూనే సెక్షన్ ఇన్‌ఛార్జి దగ్గరికి వెళ్ళి, "ఏమండీ శ్రీధర్‌గారూ... సుబ్బారావు యీరోజు శెలవా?" అని అడిగాడు.

అతను గబుక్కున లేచి నిలబడి, "సారీ సర్! సుబ్బారావు యీరోజు గంట ఆలస్యంగా వస్తానని చెప్పాడు. నిన్నే లెటర్ కూడా రాసిచ్చాడు. మీకు యిద్దామనుకుంటూనే మరచి పోయాను!" అన్నాడు లెటర్ అందిస్తూ.

పార్థసారథికి తను ఓడిపోయిన ఫీలింగ్ కలిగింది. ఒక్కసారైనా సుబ్బారావు క్రమశిక్షణ తప్పడం చూడాలని ఉంది అతనికి. అది అసూయా?, శాడిజమా? ...అతనికే అర్థంకాలేదు.

లెటర్ అందుకుని చదివాడు. తన తల్లి సాంవత్సరీకమని, అందువల్ల గంట ఆలస్యంగా వచ్చేందుకు అనుమతి యివ్వమని రాశాడు. "ఇలా ఉత్తరం యివ్వాలా? ఓరల్‌గా చెబితే చాలదా?" అని అడిగాడు శ్రీధర్‌ని. ఆఫీసులో అందరూ ఫోన్ల ద్వారా పర్మిషన్ తీసుకుంటూంటారు. ఇలా పర్మిషన్ కోసం రాసిన ఉత్తరం చూడటం అతనికి అదే మొదటిసారి.

"నెలకు రెండుసార్లు రిటన్ రిక్వెస్ట్ మీద పర్మిషన్ తీసుకునే ప్రివిలేజ్ వాళ్ళకుంది సార్! సుబ్బారావు రూల్స్‌ని ఖచ్చితంగా పాటించే మనిషి."

తల ఊపి గదిలోకి వచ్చి పనిలో మునిగిపోయాడు పార్థసారథి. అయితే అప్పుడప్పుడు గడియారం వైపు మాత్రం చూస్తూనే ఉన్నాడు. సరిగ్గా పదకొండు కాగానే బయటకు వచ్చి సుబ్బారావు సీటు వైపు చూశాడు...

సుబ్బారావు సీట్లో కూర్చుని పని చేస్తున్నాడు.

"స్వాతంత్ర్య దినోత్సవం నాడు మీకు చిన్నపాటి సన్మానం చేయదలిచాము..." - పార్థసారథి సుబ్బారావుతో అన్నాడు.

"సన్మానమా? ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారావు.

"మీ పంక్చువాలిటీకి గుర్తింపు! మీ సిన్సియారిటీకి ప్రోత్సాహం!"

"అది నా గొప్పతనం కాదు. మిగిలినవాళ్ళ ఉదాసీనత! మీరేమీ అనుకోనంటే మీ అసమర్థత!"

"ఏమిటి మీరు మాట్లాడుతున్నది?" కోపంగా అన్నాడు పార్థసారథి.

"కోపగించుకోకండి. మీరే ఆలోచించండి... అందరూ పది గంటలకు ఠంచనుగా ఆఫీసుకి వస్తే నాకు యీ గుర్తింపు దొరికేది కాదు. అందరితో పాటు నేనూ ఒకడిలా ఉండేవాడిని. పంక్చువాలిటీ ఎవరూ పాటించడం లేదు కాబట్టి నేను ప్రత్యేకంగా కనిపిస్తున్నాను. టైముకి రాకపోవడం వాళ్ళ తప్పైతే వాళ్ళను టైముకి రప్పించలేకపోవడం మీ తప్పు!"

పార్థసారథి ఏం మాట్లాడలేదు.

"నాకు తెలిసి మన ఆఫీసులో స్పోర్ట్స్‌మన్‌లు లేరు, కళాకారులు లేరు, సమాజ సేవకులు లేరు. ఈ ఆఫీసులో ఉద్యోగిగా తప్ప మరే విధమైన గుర్తింపు గాని, కార్యక్రమాలు గాని లేనివాళ్ళు. మరి, వాళ్ళను పది గంటలకు ఆఫీసుకి రాకుండా ఏ శక్తి ఆపుతుందో నాకర్థం కావడం లేదు. ఎవరూ అడగడం లేదన్న ధైర్యం, 'అరగంట లేటుగా వెళ్తే కొంపలేం అంటుకుపోవు' అన్న కాంప్లసెన్స్ ఈ పరిస్థితికి కారణం! మీరు చిత్తశుద్ధితో పూనుకుంటే యీ పరిస్థితి మారుతుంది."

సుబ్బారావు తన సీటుకు వెళ్లిపోయాడు.

అతని మాటల్లో నిజం ఉన్నా ఒప్పుకోవడానికి పార్థసారథికి అహం అడ్డొచ్చింది... ఆ విషయం గురించి మరచిపోయి పనిలో పడ్డాడు.

●

ఆ రోజు సోమవారం!

ఉదయం పదిన్నర గంటలకు సుబ్బారావు సీట్లో లేకపోవడం గమనించాడు పార్థసారథి. శ్రీధర్ దగ్గరికి వెళ్లి సుబ్బారావు గురించి అడిగాడు.

"అదే నాకూ ఆశ్చర్యంగా ఉంది సార్! చెప్పకుండా లీవు పెట్టడం, లేటుగా రావడం అతనికి అలవాటు లేదు. పాపం... ఆరోగ్యం బాగాలేదేమో?!" అన్నాడు శ్రీధర్.

"ఆరోగ్యం బాగాలేకుంటే ఫోన్ చేసి చెప్పవచ్చు కదా!" అన్నాడు పార్థసారథి.

కారణం ఏదైనా సుబ్బారావు పది గంటలలోపు పర్మిషన్ గురించి గాని, లీవు గురించి గాని కబురు పంపలేదన్న విషయం అతనికి ఆనందాన్నిచ్చింది.

పన్నెండు గంటలకు ఓ యువకుడు వచ్చి సుబ్బారావుకు ఏక్సిడెంట్ అయిందని, తలకు బాగా దెబ్బ తగిలిందని, హాస్పిటల్‌లో అడ్మిట్ చేశామని, అతను కోమాలో ఉన్నాడని, నాలుగు గంటలు గడిస్తే గాని ఏ విషయం చెప్పలేమని డాక్టర్లన్నారని చెప్పాడు.

స్టాఫ్ అందరూ "అయ్యో పాపం..." అన్నారు. కొందరు హాస్పిటల్‌కి బయలుదేరారు.

"ఎక్కడ జరిగింది ఆక్సిడెంట్?" పార్థసారథి ఆ యువకుణ్ణి అడిగాడు.

"అంకుల్ ఆఫీసుకి బైక్ మీద వస్తూంటే హైరోడ్డులో ఓ ఆటో వెనకనుంచి గుద్దేసింది. నేనూ ఆ సమయంలో అదే రోడ్లో వెళ్తున్నాను. అంకుల్‌ని ఆటోలో హాస్పిటల్‌కి తీసుకెళ్లాను. దారిలో అంకుల్ తన సెల్‌ఫోన్ నా చేతికిచ్చి మీ నెంబరు చెప్పి మెసేజ్ యివ్వమన్నారు. నేను ఆ పని పూర్తిచెయ్యగానే ఆయన స్పృహ తప్పారు."

పార్థసారథి వెంటనే తన గదికి వెళ్లి డ్రాలో ఉన్న సెల్‌ఫోన్ తీసి చూశాడు. మెసేజ్ ఉంది అందులో...

"మెట్ విత్ ఏన్ ఏక్సిడెంట్! ప్రే లీవ్ ఫర్ వన్ వీక్ - సుబ్బారావు."

ఆ మెసేజ్ తొమ్మిదీ యాభైకి యివ్వబడింది.

●

'భావ తరంగిణి' మాసపత్రిక 'అష్టమ వార్షికోత్సవ కథల పోటీ'లో బహుమతి పొంది,
'భావ తరంగిణి' డిసెంబర్ సంచికలో ప్రచురితం.

తమ రచనలను పుస్తకరూపంలోకి తీసుకురావాలన్న ఆసక్తి, అభిలాష
ఉండికూడా ప్రచురణకి అయ్యే ఖర్చుని చూసి వెనుకంజ వేస్తున్న
వర్ధమాన, అనుభవజ్ఞులైన రచయితలకు ప్రచురణ వ్యయంలో వెసులుబాటును కల్పిస్తూ...

**జయంతి పబ్లికేషన్స్**

రూపొందించిన ప్రచురణ విధానాల గురించిన పూర్తి వివరాల కోసం
రూ॥ 5/- స్టాంపు అంటించిన కవరును జతపరచి మా అడ్రసుకి వ్రాయండి.